ఏడాదికి పైగా వెలగని దీపాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రధాన రహదారిలో వెలగని ఐమాస్ దీపాలు

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ సర్కిల్ సమీపంలో ఆర్వి జానకి రామయ్య ఘాట్ నుంచి పెట్రోల్ బంక్ వరకూ ఏర్పాటు చేసిన ఐమాస్ వీధి లైట్లు ఒకటిన్నర సంవత్సరం నుంచి వెలగడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది శ్రీసత్యసాయి జయంతి వేడుకలు సందర్భంగా కూడా అధికారులు ఈ లైట్లను పట్టించుకోలేదు. సుమారు ఒక కిలోమీటర్ వరకూ రాత్రి సమయంలో చీకటి ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుర్తుతెలియని కారు డివైడర్ పైన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఆ విద్యుత్ స్తంభం దెబ్బతిని వీధి దీపాలు వెలగడం లేదన్నారు. వారం రోజుల్లో సత్యసాయి బాబా జయంతి వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఈ మార్గంలో ఐమాస్ లైట్లు వెలిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం...

న్యాయం చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్

ప్రజాశక్తి-హిందూపురం

పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు కర్కశంగా రాత్రికి రాత్రే తొలగించారని ఈ విషయంలో ఎవరు అధైర్య పడకూడదని, సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ బాధితులకు ధైర్యం చెప్పారు. హిందూపురం పట్టణ పరిధిలోనికొల్లకుంట సమీపంలో సుమారు 8.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో గత 8 నెలల క్రితం సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి పట్టణంలోని 446 నిరు పేద కుటుంబాలకు భూమిని పంచారు. అందులో పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఆ గుడిసెలను రెవిన్యూ, పోలీస్ అధికారులు జెసిబిలను పెట్టి తొలగించారు. ఈ నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ బాధితులను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతు సొంత ఇల్లు లేని నిరు పేదలకు ఇంటి స్థలాలను కేటాయించాలని అధికారులు, పాలకుల చుట్టు తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. సర్వే నెంబరు 21, 23 - 3లో సుమారు 8.5 ఎకరాల భూమికి గతంలో పేదలకు ప్రభుత్వం సాగు పట్టా ఇచ్చిందన్నారు. ఆ భూమి సాగులో లేకపోవటంతో అందులో పేదలు 8 నెలల క్రితం గుడిసెలను వేసుకున్నారు. అప్పటి నుంచి ఏ అధికారి సైతం అక్కడికి వెళ్లి ఖాళీ చేయమని చెప్పలేదన్నారు. ఈనేపథ్యంలో ఉన్న ఫలంగా రెండు రోజుల క్రితం పరాయి దేశస్తులపై యుద్ధం చేసినట్లు పోలీసులు, అధికారులు అర్ధ రాత్రి వచ్చి జెసిబిలతో గుడిసెలను కూల్చారన్నారు. ఈ చర్యల వెనుక ఎవరి హస్తం ఉందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని బట్టి చూస్తుంటే అధికారులకు ప్రజలపై కక్ష సాధింపు తప్ప బాధ్యత లేదనిపిస్తోందని విమర్శించారు. లక్షలాది రూపాయలు వడ్డీలకు తీసుకువచ్చి వేసుకున్న నివాసాలను కూల్చడంతో పాటు ఇంట్లో ఉన్నా వంట సామాన్లు జెసిబిల కిందకు పడి పనికి రాకుండా పోయాయన్నారు. హిందూపురం నియోజకవర్గ ప్రజలు టిడిపికి వరుస విజయాలను అందిస్తున్నా పేదలపై జూలుం చలాయించడం తగదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే ఇంటి పట్టాలను ఇవ్వడంతో పాటు జరిగిన నష్టానికి నష్ట పరిహారం ఇస్తు, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఇంత జరుగుతున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే బాలకృష్ణ స్పందించి పేద ప్రజలకు న్యాయం చేయకపోతే చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టి టిడిపి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జెడ్ పి శ్రీనివాసులు, రమణ, బాబావలి, నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

తొలగించిన గుడిసెలను పరిశీలిస్తున్న రాంభూపాల్

సొంత ప్రాంతానికి ప్రాధాన్యతనిచ్చేరా..?

నేడు రాష్ట్ర బడ్జెట్

తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురంప్రతినిధి

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఆర్థిక మంత్రిగా నున్న పయ్యావుల కేశవ్ నేడు రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లో సొంత జిల్లాకు ఏ మేరకు ప్రాధన్యతనిస్తారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఆర్థికమంత్రి పదవిని జిల్లా నుంచి చేపట్టిన వారిలోనూ ఆయనే తొలి వ్యక్తిగానూ ఉన్నారు. జూన్‌లోనే ఏర్పాటైన తెలుగుదేశం ప్రభుత్వం బడ్జెట్‌ను ఇది వరకే ప్రవేశపెట్టాల్సి ఉంది. అయితే దాన్ని యధావిధిగా మూడు నెలలపాటు అదనంగా కొనసాగించారు ఇప్పుడు మార్చి వరకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

సాగునీటికి ప్రాధానత్యనిచ్చేరా ..?

అనంతపురం జిల్లా అంటూనే నిత్యం కరువు గుర్తుకు వస్తుంది. ఈ జిల్లాలో సాగు,తాగునీటికి అవసరాలు చాలా ఎక్కువగానున్నాయి. అయితే సాగు, తాగునీటి ప్రాజెక్టులన్నీ కూడా గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగు,తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నిర్వహణ అధ్వాన్న స్థితిలో ఉంది. ఆధునీకరణ పనులు గత ప్రభుత్వం రద్దు చేసింది. కనీస నిర్వహణకైనా రూ.35 కోట్లు అవసరమని ప్రతిపాదనలను జలవనరుల అధికారులు ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం మంజూరు చేస్తూ ఇది వరకే ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. పూర్తి స్థాయి ఆధునీకరణకు ఏదైనా ప్రకటన వస్తుందా అన్న విషయంపై జిల్లావాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పిఎబిఆర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నింపేందుకు భూసేకరణతోపాటు జివోమెమ్రైన్ చేపట్టాల్సి ఉంది. దానిపై బడ్జెట్‌లో ఏ రకమైన చర్యలుంటాయన్నది చూడాల్సి ఉంది. గత టిడిపి ప్రభుత్వం హంద్రీనీవా ప్రాజెక్టు ప్రవాహ సామర్థ్యం పెంపుదల చేపట్టి ఉండింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి దీని సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించడమే కాకుండా టెండర్లు ఆహ్వానించింది. పనులు మాత్రం చేపట్టలేదు. ఈ బడ్జెట్‌లో హంద్రీనీవాపై ఏ మేరకు ప్రాధాన్యతనిస్తారనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీమే.

సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై విధంగా ఉంటే తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఇంచుమించు అదే విధంగా ఉంది. సత్యసాయి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి చాలా దశాబ్దాలు అయిన నేపథ్యంలో పైపులైన్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇది కాకుండా ఇక సిపిడబ్లు స్కిమ్‌ల్లోనూ మోటర్లు, ఫిల్టరు బెడ్లు కూడా దెబ్బతిన్నాయి. సాక్షాత్తు ఆర్థిక మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గానికి తాగునీటికి అందించే ప్రాజెక్టులే దెబ్బతిన్నాయని ఆయన స్వీయ పరిశీలనలో తేలింది. ఇప్పుడు ఈ ప్రాజెక్టులకు ఆయన నిధుల కేటాయింపులు చేస్తారా లేదా అన్నది చూడాల్సిఉంది. ఏది ఏమైనా ఆర్థిక మంత్రిగా పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టే తొలి బడ్జెట్ ఏ విధంగా ఉండనుందని జిల్లావాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కరాటే మాస్టర్ రఫీక్ అహ్మద్

జాతీయ స్థాయి పోటీల్లో ఎల్‌ఆర్‌జి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ కరాటే పోటీల్లో హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్నా ఎల్‌ఆర్‌జి విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ రఫీక్ అహ్మద్ తెలిపారు. అదివారం కర్నాటక రాష్ట్రం చిక్కబళ్ళాపుర జిల్లా గౌరిబిదనూరులో 6వ జాతీయ కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఎల్‌ఆర్‌జి విద్యాలయ నుంచి ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఇద్దరు బంగారు, ఒకరు సిల్వర్, నలుగురు రజత పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ రఫీక్ అహ్మద్ తెలిపారు. దీంతో పాటు రైఫిల్ షూటింగ్ లో సూర్య ప్రథమ స్థానం, అంజిని మనోజ్ఞ తృతీయ స్థానం సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల సెక్రటరీ బాలసుందరం, హెచ్‌ఎం ప్రసాద్, ఎఒ సంజీవ రెడ్డితో పాటు కరాటే మాస్టర్లు రియాజ్‌బాషా జనార్ధన రెడ్డి తదితరులు అభినందించారు.

కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు

సామాజిక చైతన్యం పెంచే రచనలు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

నేటి తరం కవులు, రచయితలు సామాజిక చైతన్యం పెంచే రచనలు చేయాలని కవులు, రచయితలు అభిప్రాయ పడ్డారు. ప్రముఖ రాయలసీమ మాండలిక కవి సడ్లపల్లి చిదంబర రెడ్డి స్థాపించిన తపన సాహితీ వేదిక కార్యాలయంలో సడ్లపల్లె కథా పురస్కారాలు, తపన సాహిత్య వేదిక ప్రోత్సాహక పురస్కారాలను ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలోని తపన సాహిత కార్యాలయంలో ప్రదానం చేశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి తెలుగులో వెలువడిన 100కు పైగా కథా సంపుటాలను ఈ పోటీలో ఉంచారు. రాష్ట్రం లోని పేరు మోసిన ప్రముఖ సాహితీవేత్తలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వారు రెండు ఉత్తమ లక్షణాలు గల కథా సంపుటాలను ఎంపిక చేశారు.కర్నూలు నగరానికి చెందిన రచయిత మారుతి పౌరోహితం రచించిన "ఊరిమర్లు ", బెంగళూరుకు చెందిన రచయిత్రి ఝాన్సీ పాపు దేశి రచించిన "దేవుడమ్మ మరో 10 కథలు " అనే కథా సంపుటాలు ఈ పురస్కారానికి ఎంపిక చేయబడ్డాయి. విజేతలకు ఒక్కొక్కరికి రూ.10వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. అదే విధంగా రాయలసీమలోని రచయితలను ప్రోత్సహించడానికి ప్రదానం చేయబడే తపన సాహిత్య వేదిక ప్రోత్సాహకాలకు అనంతపురం పట్టణానికి చెందిన యాములపల్లి నర్సిరెడ్డి, హిందూపురం పట్టణానికి చెందిన సిద్ధగిరి శ్రీనివాస్, కడప జిల్లా బద్వేలుకు చెందిన వివేక్‌కు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు, జ్ఞాపికను అందించారు కవి, రచయిత తూముచర్ల రాజారాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈ పురస్కారాల వ్యవస్థాపకులు సడ్లపల్లి చిదంబర రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, రాయల సీమ ప్రముఖ కథా రచయిత శాంతి నారాయణ, అరసం జిల్లా అధ్యక్షులు ఈశ్వర రెడ్డి, అధ్యాపకులు అంకె శ్రీనివాస్, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, ఏటిగడ్డ అశ్వత్ నారాయణ, అరసం జిల్లా కార్యదర్శి నానీల నాగేంద్ర, శేషగిరి రాయుడు, పులివెందుల వెంకట కొండారెడ్డి, జిల్లా రచయితల సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షులు జాబిలి చాంద్ బాషా, జిరసం అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్షరమాలి సురేష్, ప్రముఖ నవలా రచయిత సొంటి జయప్రకాష్, స్థానిక అరసం సభ్యులు ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, తిలక్, గంగాధర్, ఉదయ భాస్కర్ రెడ్డి, గంగిరెడ్డి, సాహితీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాడుదాం

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్

కదిరిలో యుటిఎఫ్ 50వ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు

మహాసభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఐక్యమత్యంగా పోరాడుదామని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యూటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా మహాసభలు ఆదివారం కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ స్వర్ణోత్సవ మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరైన యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈసందర్భంగా అంబేద్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, టవర్ క్లాక్ కాలేజ్ సర్కిల్ మీదుగా మహాసభ ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా మహాసభల్లో కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ అలుపెరగని పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. ఉపాధ్యాయులు అనేక సంక్షేమాలు, అభివృద్ధి పొందారంటే యుటిఎఫ్ చేసిన పోరాటాల ఫలితమే అన్నారు. నేటికీ ప్రభుత్వ విద్యా రంగంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని వాటిని అధిగమించి ముందుకు సాగాలంటే ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాల్సుందన్నారు. పాలక ప్రభుత్వాలు జాతీయ నూతన విద్యా విధానం అనుసరిస్తూ ప్రభుత్వ బడులను ఎత్తివేసి తమ బాధ్యత నుంచి తప్పుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినిందని అన్నారు. ఈ ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా, బోధనా సమయాన్ని ఆప్‌ల పనిభారంతో, ఆన్‌లైన్‌వర్క్ తో వధా చేస్తోందన్నారు. అపార్ పనిని సరళీకరణ చేసి, గడువు పెంచాలని కోరారు. 117 జీవో వల్ల ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించే పరిస్థితి ఏర్పడిందని దానివల్ల ఉపాధ్యాయులపై పని భారం పెరిగిందని అన్నారు గతంలో మాదిరిగానే ప్రైమరీ. అప్పర్ ప్రైమరీ, హై స్కూల్ వంటి విధానాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పడం శుభ పరిణామమే అన్నారు. అయితే ఆ నెపంతో ప్రభుత్వ బడులను ఎత్తివేసే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, తక్కువ సంఖ్య ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూల్లో కూడా ఎత్తివేస్తామని సంకేతాలు వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ బడుల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారన్న లెక్కలను ప్రభుత్వం చెప్పకుండా దాటవేస్తోందన్నారు. విద్యార్థులు తగ్గిపోతే ప్రభుత్వం బడులను కూడా తొలగించే ప్రమాదం ఉందని కావున ఉపాధ్యాయులగా ప్రభుత్వ బడులను కాపాడుకోవడానికి నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం హక్కులు విధులు కోసమే కాకుండా సామాజిక బాధ్యతగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందన్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 5 నెలలు కావస్తున్నా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించలేదని అసలు పిఆర్‌సి ఊసే లేకుండా ఉద్యోగ ఉపాధ్యాయులను ఈ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు దాదాపు 20 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సింది ఉందని, అందులో కేవలం రూ. 350 కోట్లు మాత్రమే చెల్లించారని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న నత్యాలు

యుటిఎఫ్ జిల్లా మహాసభలను పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీలో, మహాసభలలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్ అలీ, శ్రీనివాసులు, భాషా, మనోహర్, నాగరాజు,అనిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప ఎన్నికల అధికారిగా వ్యవహరించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా భూతన్న, అధ్యక్షులుగా శెట్టిపి జయచంద్రారెడ్డి, సహాధ్యక్షులుగా బాబు, సీతామహాలక్ష్మి, ప్రధానకార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా శ్రీనివాసులు, జిల్లాకార్యదర్శులుగా.తాహీర్ వలీ, రమీజాబీ, శివశంకర్, లక్ష్మీ నారాయణ, నరేష్ కుమార్, వైవి. సుబ్బా రెడ్డి, అనీల్ కుమార్, లతా దేవిని ఎన్నుకున్నారు. అదే విధంగా రాష్ట్ర కౌన్సిలర్లుగా మారుతీ శ్రీనివాస్, మేరీ వర కుమారి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా మహాంతేశ్వర, సభ్యులుగా ఆంజనేయులు, రామకృష్ణ నాయక్, సురేష్, చాంద్‌బాషా, మల్లికార్జున, ఆదినారాయణ, క్రిష్టప్పను ఎన్నుకున్నారు. మహిళా కమిటీ కన్వీనర్‌గా హసీనా బేగం, సిపిఎస్ కమిటీ కన్వీనర్‌గా సునీల్ కుమార్, మున్సిపల్ కమిటీ కన్వీనర్‌గా రామాంజి నేయులు, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, జిల్లావ్యాప్తంగా వచ్చిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఆలయ నిర్మాణానికి 'అనంత'ఎంపీ విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని గాంధి సర్కిల్ నూతనంగా చేపట్టిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం కోసం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విరాళం అందజేశారు. రూ. 2,01,116లను ఆలయ కమిటీ నిర్వహకులకు ఆదివారం హిందూపురంలో తన నివాసంలో అందించారు. దీంతో పాటు ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వహకులు అంబికాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వహకులు జెఈ వెంకటస్వామి, నిమ్మకాయ రాము, రఘు, చంద్రమోహన్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పు సుల్తాన్ జయంతి

హిందూపురం : టిప్పు సుల్తాన్ జయంతిని పట్టణంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ముక్కడిపేటలో హ్యూమనిజం అజ్మతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా సాధుచెట్టి సంఘం అధ్యక్షులు జెఈ. వెంకటస్వామి, బాలాజీ మనోహర్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో దాదాపు 12 మంది విద్యార్థులు టిప్పు సుల్తాన్ వేషధారణలు, ప్రసంగాలతో అలరించారు. . ఈ సందర్భంగా సామాజిక సేవకులకు టిప్పు సుల్తాన్ వేషధారణ వేసిన విద్యార్థులకు, రక్తదాతలకు, సామాజిక సేవకులకు అవార్డులు మెమెంటోలు, పురస్కారాలు అందజేశారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

ఉషశ్రీచరణ్‌పై ఎమ్మెల్యే కందికుంట ఫైర్

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన ఆదివారం పట్టణంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమెకు సిఎం చంద్రబాబును విమర్శించే అర్హత, స్థాయి లేవన్నారు. జగన్ పాలనలో ఐదేళ్లపాటు రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగించారని, వైసిపి నేతలు ప్రజల్లోకి వెళితే ప్రజలు రాళ్లతో కొడతారని హెచ్చరించారు. దమ్ము, ధైర్యం ఉంటే మాజీ సిఎం జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీకి రాకుండా పారిపోతున్న సైకో బ్యాచ్‌కు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు.

టెక్నికల్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-గుడిబండ

రమేష్(ఫైల్‌ఫోటో)

మండలంలోని కూగిర్లపాలెం గ్రామానికి చెందిన రమేష్(52) ఉపాధి హామీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా కుందుర్పిలో విధులు నిర్వహించేవారు. అతడు ఆదివారం ఇంట్లో ఉన్నఫళంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా ఉపాధి హామీ అధికారులు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ నాగరాజు, బూదిపల్లి నాగభూషణ, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు రమేష్ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వాల్మీకి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపి అంబికా, నాయకులు

వాల్మీకుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

వాల్మీకుల అభ్యున్నతి, సామాజిక అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని ఆదివారం ఎంపి అంబికా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం శుభపరిణామం అన్నారు. రామాయణం వంటి మహాకావ్యాన్ని రచించి మానవ విలువలు, బంధుత్వాల బలపరిచిన ఘనత వాల్మీకి మహర్షికే దక్కు తుందన్నారు. ఆయన ఎక్కడ పూజింపబడతారో అక్కడ సిరిసంపదలు కొలువై ఉంటాయని కొనియా డారు. అనంతరం వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించి అభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలయ్య వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రబాబు, టిడిపి నాయకులు బాలాజి, అంజన్న, రంగారెడ్డి, గంగాధర్, డీలర్ సెల్ అధ్యక్షుడు శివశంకర్, వాల్మీకులు నాగేంద్ర, నరేంద్ర, ప్రవీణ్‌కుమార్, చరణ్, నారాయణప్ప, పెద్ద నారాయణప్ప, సూరి, అంజి, శీన, నాగరాజు, ముద్దన్న, గంగాధర పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో జిల్లాకు దక్కని చోటు..

నిరాశలో తెలుగుతమ్ముళ్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో శ్రీసత్యసాయి జిల్లాకు చోటు దక్కలేదు. మొదటి, రెండో విడతలో కూడా నామినేటెడ్ పోస్టులు దక్కకపోవడంతో ఆశావహులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టిసి.వరుణ్‌కు మాత్రమే చోటు దక్కింది. జిల్లాలో పుడా, వక్ఫ్ బోర్డు, దేవాదాయ శాఖ, తదితర శాఖల బెర్తుల్లో చోటు దక్కుతుందని ఆశపడ్డ తెలుగు తమ్ముళ్లు భంగపడ్డారు. అయినప్పటికీ క్యాబినెట్ ర్యాంకు గల పుడా ఛైర్మన్ పదవికి పలువురు టిడిపి నాయకులు పోటీ పడుతున్నారు. పుడా పరిధి పెరగడం ఎమ్మెల్యే తరువాత అంతటి హోదా ఉండడంతో పలువురు నాయకులు తమ వంతుగా తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. రామ లక్ష్మణులలో ఒకరైన లక్ష్మీపతి, పట్టణ కన్వీనర్ బోయ రామాంజనేయులు, యువ నాయకుడు ఊరు వాళ్లి సురేష్‌నాయుడు పుడా పదవి రేసులో ఉన్నారు. వీరందరూ పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్ దృష్టికి బయోడేటాతో పాటు ఇతర విషయాలు తీసుకెళ్లారు. అలాగే ఇతర పోస్టులపై మహమ్మద్ రఫీ, సామకోటి ఆదినారాయణ, మున్సిపాలిటీ టిడిపి ఫ్లోర్ లీడర్ తదితరులు ఇంకా ఆశతో ఉన్నారు. ఎవరి వంతు వారి ప్రయత్నాలు చేస్తున్నా అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

బదిలీ అయిన డిఇఒ మీనాక్షిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బదిలీ డిఇఒకి ఉపాధ్యాయుల సన్మానం

ప్రజాశక్తి-లేపాక్షి

జిల్లా విద్యాధికారిణిగా సేవలందించి, బదిలీపై కడప జిల్లాకు వెళ్తున్న మీనాక్షికి మండలంలోని ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక నవోదయ పాఠశాలలో ఆదివారం ఎంఇఒ నాగరాజునాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డిఇఒను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మీనాక్షి జిల్లా విద్యాధికారిణిగా విద్యారంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. పిల్లలకు సొంత్యం విషయంలో శ్రద్ధ వంచన లేకుండా పని చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 కుళ్లాయప్ప, పరిగి ఎంఇఒ శేషాచలం, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న మందకృష్ణ 'అనంత' పర్యటన

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఈ నెల 16వ తేదీ ఉమ్మడి అనంత పురం జిల్లాలో పర్యటిస్తారని, అందులో మండలంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎంఆఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నాగళ్ల బావన్న అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి నాగేంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా గత ఆగస్టు 1న తేదీ సుప్రీంకోర్టు ఎబిసిడి వర్గీకరణను సమర్థిస్తూ తీర్పు వెల్లడించిందన్నారు. దీంతో రాష్ట్రంలో ఎబిసిడి వర్గీకరణ కార్యాచరణలో భాగంగా ఈ నెల 16వ తేదీ మందకృష్ణ ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిపారు. ఆయన పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్రదొడ్డప్ప, పలక గంగన్న, ఎంఆఎఫ్ నాయకులు వై.నరసింహులు, ఆర్టీసీ డ్రైవర్ నరసింహులు, సీనియర్ జర్నలిస్ట్ వసంతం భుజంగరావు, గంగాద్రి, కత్తి అనంద్, వై.లక్ష్మీపతి, జయరాం, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన ఎమ్మార్పీఎస్, ఎంఆఎఫ్ నాయకులు

ప్రాచీన ఆలయాలపై మరింత సాహిత్యం రావాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రాచీన ఆలయాల విశిష్టతను తెలపడం కోసం మరింత సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు, పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ గుండ్లూరు బాల సుబ్రమణ్యం ఆకాంక్షించారు. పట్టణంలోని సాయి ఆరామంలో ఆదివారం బాలసుబ్రమణ్యం అధ్యక్షతన చరిత్రకారుడు మైనాస్వామి రాసిన 'ప్రాచీన ఆలయాల వైభోగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మైనాస్వామి చేస్తున్న కృషిని, అనుసరిస్తున్న మార్గాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పరిశోధకులను కోరారు. ఎపిలో కొన్ని వేల ఆలయాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం అతి తక్కువగా లభ్యమవుతుందని, ప్రతి ఆలయంపై ఓ పుస్తకం తీసుకురావాలని దేవాదాయ శాఖకు విజ్ఞప్తి చేశారు. మైనాస్వామి మాట్లాడుతూ బృహత్తర పర్యాటక వలయం అభివృద్ధిలో భాగంగా తాను ప్రాచీన ఆలయాల వైభోగం పుస్తకాన్ని రాశానని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలోని హేమావతి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకూ ఉన్న ప్రాచీన ఆలయాలపై సిఎం చంద్రబాబుకు నివేదిక సమర్పించానని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా అభివృద్ధి జరిగితే ఆయా ప్రాంతాల రూపురేఖలు సమూలంగా మారడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో ఉపాధి పెరుగుతుందని, తద్వారా ఆదాయం లభిస్తుందని వివరించారు. అతిథి కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మైనాస్వామి సహకారంతో కదిరి నరసింహస్వామి ఆలయంపై ఓ పుస్తకం తీసుకురావాలని సంకల్పించినట్లు చెప్పారు. ప్రాచీన ఆలయాల వైభోగం గురించి తెలుసుకోవాలన్నా, భావితరాలకు తెలియజెప్పాలన్నా ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. ప్రాచీన ఆలయాలను సందర్శించడం ద్వారా మనోవికాసం కలగడమే కాకుండా, ఆచార సంప్రదాయాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని విహెచ్‌పి నాయకుడు డాక్టర్ వేదవ్యాస్ తెలిపారు. పుట్టపర్తి ప్రాధాన్యత, భగవాన్ శ్రీసత్యసాయిబాబా సేవలను వివరిస్తూ మైనాస్వామి గతంలో రాసిన పుస్తకాన్ని పునర్ ముద్రించాలని బిజెపి రాష్ట్ర నాయకుడు ఆర్.కొండమరాజు కోరారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుకొమ్మలుగా నిలిచిన ఆలయాల గురించి మరింతగా ప్రచారం నిర్వహించాలని పుట్టపర్తి టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప పేర్కొన్నారు. పుట్టపర్తి పట్టణ అభివృద్ధి సంస్థ మాజీ అధ్యక్షుడు కోటా సత్యం మాట్లాడుతూ ఆలయాల చరిత్ర, సంస్కృతిని వెలికి తీయడం కోసం సుమారు 35 ఏళ్ల నుంచి మైనాస్వామి పరిశోధన చేస్తుండడం అభినందనీయమన్నారు. టిడిపి నాయకుడు సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ ఆలయాల భూములను పరిరక్షించాలని దేవాదాయ శాఖకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు జగదీష్, సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వంగంపల్లి గోపి, తదితరులు మైనాస్వామి పరిశోధనలను కొనియాడారు.

మైనాస్వామి రాసిన పుస్తకావిష్కరణ సభలో వక్తలు

చరిత్రకారుడు మైనా స్వామి రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పుర ప్రముఖులు

సభ్యత్వం ఉంటేనే భవిష్యత్తులో పదవులు : పల్లె

ప్రజాశక్తి-అమడగూరు

సభ్యత్వం ఉన్న వారికి పార్టీలో ప్రాధాన్యతతో పాటు భవిష్యత్తులో పదవులు దక్కుతాయని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. వంద రూపాయలతో టిడిపి సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకూ రూ. 5 లక్షల వరకూ ప్రమాదబీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. సభ్యత్వ నమోదుపై ఆదివారం స్థానిక శ్రీచౌడేశ్వరి కళ్యాణ మండపంలో కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. పల్లె మాట్లాడుతూ రూ. 100తో టిడిపి సభ్యత్వం పొందితే రూ. 5లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించిన ఏకైక ప్రాంతీయ పార్టీ టిడిపి అన్నారు. కార్యకర్తలకు సభ్యత్వ కార్డు రక్షణ కార్డులాంటిదన్నారు. సభ్యత్వం ఉండి పార్టీ కోసం పని చేసిన కార్యకర్తకే తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు 15వేల సభ్యత్వాలు నమోదు చేశారన్నారు. లక్ష సభ్యత్వాలు నమోదు చేసేలా లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదులో పుట్టపర్తి నియోజవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రభాగంలో నిలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, కాలేనాయక్, కృష్ణారెడ్డి, కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి 'పల్లె' నివాళి

ఓబుళదేవరచెరువు : స్థానిక బిసి కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త గంగాధర్ కుమారుడు శివ ఆదివారం గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆ గ్రామం వెళ్లి శివ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అలాగే అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శివ చిన్న వయస్సులో మృతి చెందడం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. పల్లె వెంట టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుల్‌రెడ్డి, నిజాం, ఆరిఫ్‌ఖాన్, షాను, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి

పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరిటౌన్

పోరాటయోధుడు వడ్డే ఓబన్న స్ఫూర్తితో వడ్డెర సామాజికవర్గం ప్రజలు ముందుకెళ్లాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. ఖాద్రి వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. వడ్డే ఓబన్న అంటే పోరాటం, సంకల్పం, వడ్డెర సామాజిక వర్గం ప్రజల ఎదుగుదలకు స్ఫూర్తి అని అభివర్ణించారు. వడ్డెర్లు ఎప్పుడూ టిడిపి వెంటే ఉన్నారని తెలిపారు. గతంలో తన ప్రత్యర్థి వడ్డెర సామాజికవర్గం వ్యక్తి అయినా తననే ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తు చేశారు. తాను ఎల్లప్పుడూ వడ్డెర కులస్తులకు రుణపడి ఉంటానని చెప్పారు. అన్ని వర్గాలకు చెందిన బిసిలు ఐక్యతగా అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. గతంలో ఆ వర్గానికి ఇచ్చిన మాట ప్రకారం వడ్డెర కులస్తులకు త్వరలో కమ్యూనిటీ హాలు నిర్మించి ఇస్తానని తెలిపారు. అంతకుముందు వడ్డెర కులస్తులు స్థానిక రోడ్లు భవనాలు అతిథి గృహం నుంచి వేడ్డ ఓబన్న విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోళ్లకుంట అంజనప్ప, సంఘం జిల్లా అధ్యక్షులు జెవి.రమణ, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, ఖాద్రి వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంగయ్య, సైదాపురం రమణ, సంపంగి గోవర్ధన్, రమేష్, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.


వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ఎంపిఇఒ వ్యవస్థను బలోపేతం చేయాలి

ఎంపిఇఒల సంఘం జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎంపిఇఒ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎంపిఇఒల సంఘం జిల్లా నూతన అధ్యక్షులు కోడికళ్ల రవికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బత్తలపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధికి తోడ్పడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న ఎంపిఇఒలకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని కోరారు. 2015-16లో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రతి రెవెన్యూ విలేజ్‌కి ఒక ఎంపిఇఒను నియమించాందన్నారు. పదేళ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎంపిఇఒల వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అందాల్సిన పథకాల్లో ప్రధాన భూమిక పోషిస్తున్న ఎంపిఇఒల సాధక బాధకాలను కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఆన్ డ్యూటీ విధుల్లో భాగంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న ఎంపిఇఒలను ఓడి బేస్ రద్దు చేసి ఉమ్మడి జిల్లాలకు రప్పించినందుకు సిఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

12 నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్

మండలంలో ఈ నెల 12 నుంచి 29వ తేదీ వరకూ నిర్వహించే 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో ప్రజలు తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తేదీల వారీగా మండల వ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. అందులో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ప్రజలు తమ సమస్యలపై అర్జీ ఇచ్చి రశీదు పొందవచ్చు అన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసి విచారణ తర్వాత షెడ్యూల్ తేదీ ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రామసభల వివరాలను సచివాలయం, వీఆర్వోల ద్వారా తెలియపరిచామన్నారు. ఈ నెల 12వ తేదీ దర్శనమల, 13న నేలకోట, 14న మల్లాకాలువ, 15న ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, 19న రావులచెరువు, 20న తుమ్మల, సుబ్బారావుపేట, 21న పోతులనాగేపల్లి, 22న గొట్లూరు, 26న చిగిచెర్ల, 27న రేగాటిపల్లి, 28న కునుతూరు, 29న ధర్మవరంలో ఉంటుందని తెలిపారు.

పత్యేక ఓటరు నమోదుపై సిబ్బందితో చర్చిస్తున్న తహశీల్దార్ షెక్షావలి

ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని చెరువు ఆయకట్టు సంఘాలకు సంబంధించి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తహశీల్దార్ షెక్షావలి తెలిపారు. ఆయన ఆదివారం రొళ్ల మండలంలోని రత్నగిరి గ్రామంలో ఓటరు జాబితా తయారీపై సిబ్బందితో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదులో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-చిలమత్తూరు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన చిన్నారి ఎస్.మధుప్రియ తృతీయ స్థానం కైవసం చేసుకుంది. కర్నాటక రాష్ట్రంలోని గౌరిబిదనూరు లో ఆదివారం నిర్వహించిన 6వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మధుప్రియ మూడో స్థానంలో నిలిచింది. మధుప్రియ హిందూపురం పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో 4వ తరగతి చదువు తోంది. మధుప్రియను కరాటే మాస్టర్ రియాజ్, ప్రిన్సిపల్ భారతి, తల్లిదండ్రులు శ్రీనివాసులు, గాయిత్రి, హుస్సేన్‌పురం గ్రామస్తులు అభినందించారు.

ఎస్.మధుప్రియ

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-పెనుకొండ

ఇ.తనుశ్రీ

ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-17 బాల బాలికలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని రాంపురం జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇ.తనుశ్రీ చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిడి దివాకర్‌యాదవ్ తెలిపారు. తనుశ్రీ ఈ నెల 29, 30 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో జరిగే రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థిని తనుశ్రీని హెచ్‌ఎంతో పాటు ఎస్ఎంసి ఛైర్మన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సచివాలయాల్లో ఆయకట్టుదారుల జాబితా

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఈ నెల 23వ తేదీ 9 చెరువుల నీటి సంఘాలకు జరిగే ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ సచివాలయల్లో ఆయకట్టుదారుల జాబితాను నోటీసు బోర్డులో ఉంచినట్లు తహశీల్దార్ యూనస్‌బాబు తెలిపారు. ఆయా ఆయకట్టుదారులు జాబితాను పరిశీలన చేసి అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీ లోపు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

నేరాలు ఘోరాలు

గంజాయి విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణానికి చెందిన గంజాయి విక్రేత పటాన్ ముజాహిద్దీన్ అలియాస్ ముజాహిద్ ఖాన్ అలియాస్ ముజ్జుని అరెస్టు చేసినట్లు పోలీ సులు తెలిపారు. వివరాలు.. గత జులైలో కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన గంజాయి అక్రమ రవాణా, విక్రయం కేసులో ప్రధాన నిందితు డిగా ఉన్న ఇతను అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. అతడిని శనివారం స్థానిక కదిరి-పులివెందుల రోడ్డు వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో అదుపులోకి తీసుకుని కదిరి ఇన్‌ఛార్జి పుట్టపర్తి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా వారు రిమాండ్‌కి ఆదేశించారని దీంతో అనంతపురం జిల్లా జైలుకు తరలించామన్నారు. గతంలో హత్య, కర్నాటక మద్యం రవాణా, గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నందు వల్ల అతడి కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచి కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ తెరిచారు. సిఐ నారాయణరెడ్డి మాట్లాడుతూ కదిరి పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించినా, గొడవలు, గంజాయి రవాణా, విక్రయం, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, వారిపై పోలీసులు నిఘా ఉంచేందుకు రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు.

చెరువులో పడి బాలుడు గల్లంతు

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణ చెరువు మొదటి మరువ వద్ద ఆదివారం సాయంకాలం ఓ బాలుడు కాలు జారి పడి చెరువులో గల్లంతయ్యాడు. 12 ఏళ్ల ఓ బాలుడు స్నేహితులతో కలిసి చెరువును సందర్శించడానికి వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడిపోయాడు. విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ, సిఐలు, మంత్రి కార్యాలయ ప్రతినిధి హరీష్ బాబు, డోలా రాజారెడ్డి, అధికారులు చెరువు వద్దకు చేరుకుని బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆలయంలో హుండీ చోరీకి యత్నం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ శివారులోని రేగాటిపల్లి రహదారిలో వెలసిన శ్రీకాలభైరవ స్వామి ఆలయ హుండీని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం చేసి విఫలమయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు.. అర్ధరాత్రి సమయంలో ఏవో శబ్దాలు వినబడటంతో గ్రామస్తులు కేకలు వేయడంతో దొండలు అక్కడి నుంచి పారిపోరు. ఆదివారం ఉదయం రెండో పట్టణ పోలీసులు ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించారు.

బైక్ దగ్ధం

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి 12వ వార్డులో శనివారం అర్ధరాత్రి ఓ ద్విచక్ర వాహనం కాలి బూడిదైంది. బైక్ యజమాని అనిల్ మాట్లాడుతూ రాత్రి 2 గంటల సమయంలో ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనంలో మంటలు వ్యాపించాయని, వెంటనే గమనించి ఆర్పి వేశామన్నారు. అలాగే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చామన్నారు. ఆదివారం ఉదయం పోలీసులు వచ్చి సమాచారం తీసుకెళ్లినట్లు తెలిపారు. 4 నెలల క్రితం రూ. 1.5 లక్షలు వెచ్చించి ఈ బైక్ కొన్నానని అనిల్ తెలిపాడు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా.? ఎవరైనా కావాలనే పెట్రోల్ పోసి తగలబెట్టారా అనే విషయాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

రొద్దం : మండలంలోని చిన్నకోడిపల్లి గ్రామంలో ఆదివారం గొర్రెల రొప్పం పై కుక్కలు దాడి చేయడంతో గొర్రెపిల్లలు మృతిచెందాయి. బాధితుడు కురుబ నారాయణప్ప తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం సమయంలో 5 కుక్కలు గొర్రెల రొప్పంపై దాడి చేయడంతో 10 పిల్లలు మృతి చెందాయన్నారు. దీంతో దాదాపు రూ. 60 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

పేకాట జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని దుర్గమ్మ గుడి వెనుక భాగంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. అందులో పది మంది జూదరులను అరెస్టు చేసి రూ. 59,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. సిఐ మాట్లాడుతూ పట్టణంలోని అనుమానిత ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి చేస్తున్న తనిఖీలు చేపట్టామన్నారున. అందిన సమాచారం మేరకు దాడులు చేసి దుర్గమ్మ ఆలయ సమీపంలో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసి రూ. 59,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

కన్నతల్లిని, చదువుకున్న బడిని ఎన్నటికీ మరువరాదని ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1990-91లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగితెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసిమెలసి ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు నేర్పిన విద్యాబుద్ధులు గుర్తుకు తెచ్చుకుని ప్రస్తుత సమాజంలో ఓ స్థాయిలో జీవిస్తుండటం గర్వంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. వారి గురువులు రమణ, కుళ్లాయిరెడ్డి, రంగయ్య, చంద్రనారాయణ, చిన్నయ్య, అన్నపూర్ణలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఓటరు నమోదు పరిశీలన

ప్రజాశక్తి-లేపాక్షి

మండల పరిధిలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహ శీల్దార్ సౌజన్యలక్ష్మి తనిఖీ చేశారు. ఆమె ఓటరు నమోదు ప్రక్రియను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో 44 దరఖాస్తులు అందాయని, వాటిని నమోదు చేస్తామని మరణించిన వారి ఓటును తొలగిస్తామని తెలిపారు. తహశీల్దార్ వెంట సచివాలయ సెక్రటరీలు మారుతి, గ్రామ రెవెన్యూ అధికా రులు, సచివాలయ సిబ్బంది వెంకటరెడ్డి, ఉష, మంజుల పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ పీడీకి సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

కర్నాటకలోని చెలికెర పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి శ్రీసత్యసాయి జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెఎన్.నరసయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దీంతో పిడి కె.నర్సయ్య కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అలాగే ఆంధ్రలో ఎస్‌హెచ్‌జి సభ్యులను ఏవిధంగా బలోపేతం చేస్తున్నారో పిడిని అడిగి తెలుసుకున్నారు. సంఘాలను బలోపేతం చేయడంపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, కన్వీనర్ గణేష్, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, సీనియర్ పాత్రికేయుడు హెచ్.గోవిందప్ప, బిహెచ్.రాయుడు, వెలుగు సిబ్బంది ఎల్.లక్ష్మీకాంత్, నరసేగౌడ, తిప్పన్న, వీరేష్, అంజి, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, మంజునాథ్, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


పీడీని సన్మానిస్తున్న దృశ్యం